కూటమి మోసాలను ఎండగడదాం

- ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రభుత్వం చంద్రబాబుదే
- చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకున్న ఒకేఒక్క నేత వైఎస్ జగన్
- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు తెలపాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కృష్ణంపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా మహిళలకు ఇస్తామన్న ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకాల ఊసేలేదని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ హయాంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు రైతు భరోసా పథకం కింద రూ.7,500 వారి ఖాతాల్లో జమ చేసి, వారికి ఎలాంటి అవసరమున్న ఎరువులు, విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు రైతు భరోసా లేదు, సీజన్ ప్రారంభమైనా ఎరువులు, విత్తనాల కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఉచిత ఇన్సూరెన్స్ చేసి రూ.కోట్లు నష్టపరిహారం చెల్లించామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

జగన్ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. జగన్ ప్రభుత్వంలో పేదలకు 16 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, 10 లక్షల మందికి ఇళ్లు కట్టించి ఇచ్చామన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఐదేళ్లలో జగన్ రూ.3 లక్షల 65వేల కోట్లు అప్పు చేశారన్నారు. చంద్రబాబు సంవత్సరంలోనే రూ. లక్షా 75వేల కోట్లు అప్పు చేశారని, కానీ ఆ డబ్బులు ఏమి చేశారో ఎవరికి తెలియడంలేదని విమర్శించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన వ్యక్తి జగన్ అయితే పచ్చని పల్లెల్లో బెల్ట్ షాప్‌లు ప్రారంభించింది మాత్రం సీఎం చంద్రబాబు అని అన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని, అధికారులు కూటమి పార్టీల నాయకులకు తొత్తులుగా వ్యవహరించకుండా, ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రతి చోట వ్యతిరేకత ఎదురవుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ మాజీ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గుర్తించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోపిరెడ్డి బాబు, వేమిరెడ్డి ఓబుళరెడ్డి, ఇరగంరెడ్డి విజయగోపాల్ రెడ్డి, నాయకులు బొంతపల్లె వెంకటసుబ్బారెడ్డి, కోగటం వీరారెడ్డి, ఓబుళ కొండారెడ్డి, వీవీ స్వామి, చిరాకి బాషా, సానేపల్లి కిరణ్‌రెడ్డి, గుర్రాల రామమునిరెడ్డి, నగరి శ్రీకాంత్, కె.నాగరాజు, వేమిరెడ్డి యల్లారెడ్డి, కమతం వెంకటేశ్వరరెడ్డి, కె.సురేంద్ర, లోమడ వీరశేఖర్‌రెడ్డి, జయరాం, గపూర్, ఎంపీటీసీలు మహబూబ్‌బీ, ఖాదర్‌బాషా, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్‌లు చెంద్రాయుడు, రాజగోపాల్‌రెడ్డి, మాబుషరీఫ్, రామయ్య, పుత్తా శ్రీనివాసులరెడ్డి, మారెళ్ల రాజశేఖర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు చేయూత అందించాలి

శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ జేవీ రమణ


బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ జేవీ రమణ

ప్రొద్దుటూరు : పాడి రైతులకు చేయూతను అందిస్తే సుస్థిర ఆదాయం సాధిస్తారని శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సులర్ డాక్టర్ జేవీ రమణ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పశువైద్య కళాశాలలో మంగళవారం హైదరాబాద్ ఐసీఏఆర్ అనుబంధ సంస్థ ఎన్‌ఏఏఆర్‌ఎం వారి సౌజన్యంతో సుస్థిర గ్రామీణ జీవనోపాధిలో పాడి పరిశ్రమ ఆవశ్యకత అనే అంశంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ జేవీ రమణ మాట్లాడుతూ పశు సంపద అభివృద్ధి చెందడం వలన గ్రామీణ రైతులకు, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పశు సంపద వలన కలిగే వివిధ ఉపాధి అవకాశాలను వివరించారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ వెంకటేశ్వరరావు సేంద్రీయ వ్యవసాయం, సేంద్రీయ పశుపెంపకం, దేశవాలి ఆవుల ప్రాముఖ్యత, జీవ ఎరువులు, రసాయనాలు వాటి ప్రాముఖ్యతను వివరించారు. విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి మాట్లాడుతూ పశువులు, వాటి ఉత్పత్తుల ద్వారా అధిక లాభాలను ఆర్జించవచ్చన్నారు. ఎన్‌ఏఆర్‌ఎం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పశుసంపద, పశు ఉత్పత్తులు, దిగుమతుల గురించి తెలిపారు. వీసీఐ సభ్యులు, పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ గీత ప్రియ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కడపలోని ఏపీ రాష్ట్ర హేచరి నుండి కోళ్ల పెంపకం కోసం తగిన ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ కన్వీనర్ డాక్టర్ మాలకొండయ్య మాట్లాడుతూ పశువుల పెంపకంలో వ్యాధులు రాకుండా తగిన సమయంలో టీకాలు, నట్టల నివారణ మందులు వాడుకోవడం వలన సుస్థిరమైన పాల ఉత్పత్తిని పొందవచ్చని తెలిపారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎనివాస ప్రసాద్ కళాశాల తరపున అందిస్తున్న సేవలను, శిక్షణ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ రాజకిశోర్ శిక్షణలో పాల్గొన్న వారిలో కొందరైనా వ్యాపార వేత్తలుగా ఎదిగి లాభాలను ఆర్జించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సుస్థిర గ్రామీణ జీవనోపాధిలో పాడి పరిశ్రమ ఆవశ్యకతపై బుక్‌లెట్లను ఆవిష్కరించారు. అనంతరం పద్మశ్రీ డాక్టర్ వెంకటేశ్వరరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ, బద్వేలు, ప్రొద్దుటూరు, కదిరి, అనంతపురం, జమ్మలమడుగు, మైలవరం ప్రాంతాల నుంచి 45 మంది యువ రైతులు, కళాశాల అధ్యాపక బృందం డాక్టర్లు త్రివేణి, చరిత, ఇందరి, జ్యోతి, ప్రశాంత్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

గోపవరం : ఉన్నతాధికారుల ఆదేశాలతో పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయాధికారులు రైతులకు పంపిణీ చేశారు. పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న విషయం రైతులకు సమాచారం లేకపోవడంతో కొద్ది మంది రైతులు మాత్రమే విత్తనాలు తెచ్చుకున్నారు. సమాచారం అందుకున్న రైతులు సోమవారం పెద్ద ఎత్తున రైతులు ఏఓ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే కేవలం ఒక గంట మాత్రమే పంపిణీ చేసి మంగళవారం వస్తే ఇస్తామని చెప్పడంతో రైతులు వెనుదిరిగారు. దీంతో తిరిగి మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున రైతులు విత్తనాల కోసం వెళ్లగా విత్తనాల పంపిణీ యాప్ క్లోజ్ అయిందని, పంపిణీ జరగదని చెప్పడంతో రైతులు మరింత ఆగ్రహానికి గురయ్యారు. ఏఓ విజయరావుతో పాటు సిబ్బందిని రైతులు నిలదీశారు. అంతకు ముందు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. తమ చేతుల్లో ఏమీ లేదని, యాప్ ఓపెన్ అయితేనే విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పడంతో ఒక్కసారిగా రైతులంతా మండల కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎంపీడీఓ రామనాథరెడ్డి కలుగజేసుకుని వ్యవసాయాధికారులతో విషయం అడిగి తెలుసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి పంపిణీకి సంబంధించిన యాప్ క్లోజ్ అయిందని వ్యవసాయాధికారులు చెప్పారు. జీలుగలు, జనుములు స్టాకు అయితే సిద్ధంగా ఉన్నాయని, యాప్ క్లోజ్ కావడంతో రైతులకు పంపిణీ చేసే అవకాశం లేదు. ఎంపీడీఓ జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి మాట్లాడి ఒక్కరోజు మాత్రమే పంపిణీకి అవకాశం ఇవ్వాలని అధికారులకు తెలిపారు. దీంతో ఉన్నతాధికారులు యాప్ ఓపెన్ అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎట్టకేలకు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు


1557 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

గోపవరం : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములు, స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని గోపవరం రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 1557 ప్రభుత్వ భూమిని ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించేందుకు ప్రయత్నించిన వారిపై కేసు నమోదు చేసినట్లు తహసీల్దారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంచురీ పానెల్స్ పరిశ్రమ పక్కనే ఉన్న 1557 సర్వే నెంబరులో సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని దక్కించుకునేందుకు గతంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రయత్నించారు. 2020లో మునుపటి కలెక్టర్ సదరు భూమిని పీఓపీలో ఉంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దారు తెలిపారు. ఇటీవల సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీకి కొంత మంది పీఓపీకి కేటాయించిన ప్రభుత్వ భూమిలో అక్రమంగా గుడిసెలు వేసేందుకు ప్రయత్నించినందున వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో ఈ నెల 19వ తేదీన ఆరుగురిని అరెస్టు చేసి తహసీల్దారు ఎదుట బైండోవర్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదే రోజు ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయగా 20వ తేదీన సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీకి చెందిన చంద్రశేఖర్, అతని అనుచరులు ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించేందుకు ప్రయత్నించారని తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిపై రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తహసీల్దారు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె వాయిదా


మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : సీఐటీయూ రాష్ట్ర నాయకుల సూచన మేరకు మున్సిపల్ కార్మికుల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్ తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను, ఇంజనీరింగ్ కార్మికులను వేర్వేరుగా ప్రభుత్వం చూడటం బాధాకరమన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ఇస్తున్నట్లు జీఓ 36 ప్రకారం వర్కర్లకు రూ.21వేలు, స్కిల్ వర్కర్లకు రూ.24,500 ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర నాయకుల సూచనల మేరకు సమ్మెను తాత్కాలికంగా విరమించామని తెలిపారు. ఆగస్టు 4వ తేదీలోపు ఇతర డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోతే 5వ తేదీ నుంచి తిరిగి సమ్మెకు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అనంతరం కేరళ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ వ్యవస్థాపకులలో ఒకరైన వీఎస్ అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మున్సిపల్ ఇంజనీర్ శ్రీనివాసులుకు తమ ఇతర సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయ్‌కుమార్, చంటి, సాల్మన్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ఎన్‌ఎంయూ కృషి



మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ శివారెడ్డి, పాల్గొన్న ఎన్‌ఎంయూ నాయకులు

ప్రొద్దుటూరు : ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కృషి చేస్తోందని ఆ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ శివారెడ్డి తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని నజీరుల్లా కమిటీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సాయంత్రం ఎన్‌ఎంయూఏ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనిటీ అసోసియేషన్‌కు చెందిన డిపో కార్యదర్శి గోపాల్ 50 మందితో ఆర్టీసీ డిపో నుంచి నజీరుల్లా కమిటీ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీగా వచ్చి ఎన్‌ఎంయూఏలో చేరారు. ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ డిపో నూతన కమిటీలో గోపాల్‌కు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని ఆర్టీసీ యాజమాన్యంతో చర్చించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యంపై ఎన్‌ఎంయూఏ ఒత్తిడి తెచ్చి సాధించుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ రీజనల్ అధ్యక్షుడు నాగముని, రీజనల్ కార్యదర్శి సుధాకర్, డిపో సెక్రటరీ భానుప్రకాష్, గ్యారేజ్ సెక్రటరీ అశోక్, రీజనల్ నాయకులు నారాయణ, అయ్యవారప్ప, జయచంద్ర, పీఆర్‌జీ రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మానవ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు నైతిక విలువలను పెంపొందించుకోవాలని మానవత సెంట్రల్‌కమిటీ కెరీర్ గైడెన్స్ చైర్మన్ రాటాల గోపి పేర్కొన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని కొట్టి చిన్నవెంకటసుబ్బయ్య హైస్కూల్, డీఏడబ్ల్యూ మహిళా కళాశాల, ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నైతిక విలువలపై బోధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. మంచి, చెడు విచక్షణ జ్ఞానం తెలుసుకుని మెలగాలన్నారు. ప్రతి విద్యాసంస్థలో చదువులో రాణించిన నలుగురు విద్యార్థులకు రూ.700 చొప్పున నగదుతోపాటు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కళావతి, డైరెక్టర్ శ్రీధర్, అధ్యక్షుడు ఓబుళరెడ్డి, సంయుక్త కార్యదర్శి గురివిరెడ్డి, రాజ్యలక్ష్మి, రమేష్, వీరభద్రారెడ్డి, నరసింహులు, బద్రినారాయణ, ప్రధానోపాధ్యాయురాలు శైలజ, కరస్పాండెంట్ శ్రీవైష్ణవ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

అట్లూరు : బద్వేలు పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గిద్దలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథ ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామివారు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక గిద్దలూరు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు శివకుమార్, సభ్యులు లీలానారాయణ, పుల్లమ్మ, భాగ్యం, సుభాషిణి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : బెల్టుషాపులను నియంత్రించడంతో పాటు సమయపాలన పాటించని బార్ రెస్టారెంట్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని మాట్లాడుతూ బద్వేలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బార్ అండ్ రెస్టారెంట్లు ప్రభుత్వం నిర్దేశించిన సమయపాలన పాటించకుండా తెల్లవారుజామున 5 గంటలకే దుకాణాలు తెరిచి మద్యం విక్రయాలు సాగిస్తున్నారని అన్నారు. అలాగే మద్యంషాపుల యజమానుల ప్రోత్సాహంతో ప్రతి గ్రామంలో విచ్చలవిడిగా బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని, తద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మధ్యతరగతి కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆర్థికంగా చితికిపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు మస్తాన్‌షరీఫ్, రూరల్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంట సాగులో మెలకువలు పాటించాలి

చాపాడు : పంట సాగులో రైతులు మెలకువలను తప్పనసరిగా పాటించాలని మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత పేర్కొన్నారు. మండలంలోని తిప్పిరెడ్డిపల్లె, రాజుపాళెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు ఎలాంటి పంటలు సాగు చేసుకోవాలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా రాగులు, మినుములు, జొన్నలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. అనంతరం రాజుపాళెం గ్రామంలో సాగైన వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ స్వప్న, వీఏఏలు అంజలి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ సేవలు చిరస్మరణీయం

అట్లూరు : కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ స్ఫూర్తి నేటి యువతరానికి, మార్క్సిస్టు పార్టీకి శిరోధార్యమని, ఆయన పోరాటాలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చాంద్‌బాషా, అట్లూరు మండల సీపీఎం మండల కార్యదర్శి రమణయ్య కొనియాడారు. మంగళవారం అట్లూరు మండల పరిధిలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దుర్గమ్మ, స్వప్న, లత, నారాయణమ్మ, గంగయ్య, పెంచలయ్య, కొండయ్య, శివకుమార్, రవి, సిద్దయ్య, చిన్నయ్య, భూమయ్య పాల్గొన్నారు.

కొండపేట చెరువుకు కేసీ నీరు

ఖాజీపేట : కొండపేట చెరువుకు కేసీ కాలువ నీటిని నింపుతున్నట్లు కొండపేట కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు రెడ్యం రవీంద్రారెడ్డి తెలిపారు. ఖాజీపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొండపేట కాలువకు 19వ తేదీ నుంచి నీటిని విడుదల చేశామన్నారు. చివరి ఆయకట్టు అయిన కొండపేట చెరువుతో పాటు దుంపలగట్టు చెరువుకు నీరు అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రావులపల్లె, చెమ్ముళ్లపల్లె, పుల్లూరు, నందిపాడు చెరువులను నింపనున్నట్లు చెప్పారు. ఇప్పటికే కాలువకు అడ్డుగా ఉన్న కంపచెట్లను తొలగించామన్నారు. పూడికతీత పనులతోపాటు కాలువ ఆధునీకరణ పనులు అధికారుల అనుమతులు పొందగానే చేపడతామని తెలియజేశారు. కాగా ఇప్పటికే ఏటూరు కాలువకు నీరు విడుదల చేశామని ఆయన అన్నారు.

నివాళి


రమణారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల : సిద్దవరం గ్రామానికి చెందిన పార్టీ ముఖ్య కార్యకర్త పాలకొలను రమణారెడ్డి సోమవారం గుండెపోటుతో మృతి చెందిన సమాచారంతో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రమణారెడ్డి కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు ముత్యాల ప్రసాద్, రవిప్రకాష్‌రెడ్డి, సాయినారాయణరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

అట్లూరు : టీడీపీ నాయకుడు ఆక్రమించిన ప్రభుత్వ భూమిలో మంగళవారం తహసీల్దారు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని మాడపూరు రెవెన్యూ పొలంలో సర్వే నెంబర్ 1039లో 11.45 ఎకరాల విస్తీర్ణంలో గల ప్రభుత్వ భూమిని మాడపూరు పంచాయతీ పరిధిలోని కోనరాజుపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యంత్రాలతో చదును చేసి ఆ భూమిని ఆక్రమించుకోవడంతో మంగళవారం సాక్షి దినపత్రికలో దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన తహసీల్దారు సుబ్బలక్ష్మమ్మ, డిప్యూటీ తహసీల్దారు శిరీష, ఆర్‌ఐ వెంకటరమణ సిబ్బందితో కలసి ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

అమ్మవారిపేటలో 'పొలం పిలుస్తోంది'

బి.కోడూరు : మండలంలోని అమ్మవారిపేట, అయ్యవారిపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏడీఏ మురళీధర్‌రెడ్డి వరి, మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ 2025లో పంట సాగు చేసిన రైతులందరూ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే వివిధ పథకాలు, సబ్సిడీ గురించి అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి అర్హులైన రైతులు జాబితాలో లేకున్నా, ఏవైనా సమస్య ఉంటే గ్రీవెన్స్ నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ కౌశిక, వీఏఏ తహసీన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మేదర వీధిలోని శ్రీరామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో దేవస్థాన నిర్వహణకమిటీ, ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం అమ్మవారి జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 గంటలకు దేవాంగపేట జ్యోతి ఉత్సవ ప్రాంగణం నుంచి అమ్మవారికి చీరె, సారె ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని కోరారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

పోరుమామిళ్ల : వాహనదారులు విధిగా హెల్మెట్ ధరిస్తే ప్రాణానికి ఎలాంటి ముప్పు ఉండదని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురై కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. అలాగే మద్యం తాగి వాహనాలను నడపడం నేరమని దీనిని అతిక్రమిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని సూచించారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. అతివేగం ప్రమాదకరమని పేర్కొన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని వారు సూచించారు.

దర్గాలో ప్రత్యేక పూజలు

పోరుమామిళ్ల : పట్టణంలోని హజరత్ హుసేన్‌పీర్ స్వామి ఉరుసు రెండు రోజులుగా అత్యంత వైభవంగా జరుగుతోంది. ఉరుసు సందర్భంగా సోమవారం రాత్రి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఫకీర్ల మేళ తాళాలతో, వాయిద్యాల మధ్య ఇంటి నుండి దర్గాకు వెళ్లి పూలచాదర్ సమర్పించారు. దర్గాలో ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీయం బాషా, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు రాజీవ్‌బాషా, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరి రాళ్లపల్లె నరసింహులు, వైద్య విభాగం జిల్లా కార్యదర్శి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, మైనార్టీ సెల్ అధ్యక్షులు మస్తాన్, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు సాయి నారాయణరెడ్డి, ఎంపీటీసీలు ఇస్మాక్, ముర్తుజా, గురప్ప, మైనారిటీ నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

పోరుమామిళ్ల : రాష్ట్రంలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ అనుబంధ విద్యుత్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో యూనియన్ సభ్యులతో కలసి చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరించారు. ఆగస్టు 7న విజయవాడలో జరుగుతున్న విద్యుత్‌సౌధ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పీఆర్సీ అరియర్స్ వెంటనే ఇవ్వాలని, కొత్త ఆపరేటర్లకు పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొండయ్య, నౌషాద్, మహబూబ్‌పీరా, దుగ్గిరెడ్డి పాల్గొన్నారు.

కూటమి కళ్లకు గంతలు.. కనబడని గుంతలు !


తాళ్లమాపురం గ్రామంలోకి వెళ్లేదారి దుస్థితి


తాళ్లమాపురం నుంచి చాపాడు మండలానికి వెళ్లే దారి


ఎర్రగుండ్లపాడు వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


కల్లూరు గ్రామంలో..

గుంతలు లేని రోడ్లే తమ లక్ష్యమంటూ కూటమి చేసిన ప్రగల్భాలు అభాసుపాలవుతున్నాయి. రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించి నిర్దీత సమయం లోపు పూర్తి చేస్తామని గప్పాలు పలికింది. కానీ క్షేత్రస్థాయిలో అది ఎంత మాత్రం కనబడటం లేదనే వాదన మండల ప్రజల నుంచి వినిపిస్తోంది. కాగా ఎన్నికల ముందు వర్షాలకు రోడ్లపై నిలిచిన వర్షపు నీటి వద్ద కెళ్లి సెల్ఫీలు తీసుకుంటూ ప్రభుత్వంపై నానా యాగీ చేశారు. ఇందులో జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ నేత నారా లోకేష్.. వీరి బాటలో ఆయా ప్రాంతాల టీడీపీ నేతలు రోడ్ల దుస్థితిపై సోషల్ మీడియా, పత్రికలలో విష ప్రచారాలు చేసింది అందరూ చూశారు. ఇప్పుడు ఉన్న రోడ్ల పరిస్థితి చూస్తున్న ప్రజలు అప్పుడు చేసినట్టు ఎందుకు చేయడంలో ప్రశ్నిస్తున్నారు. గత శని, ఆదివారాల్లో మండలంలో కురిసిన వర్షాలకు వివిధ గ్రామాల రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కూటమి నాయకులు చిత్తశుద్ధి చూపి గ్రామీణ రహదారులను బాగుచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో దీనస్థితిలో ఉన్న పలు గ్రామీణ రహదారుల చిత్రాలు ఇలా ఉన్నాయి. – చాపాడు